సాక్షి
నిర్మల్
శనివారం । 11 । మార్చి । 2023



సందర్శించి.. తెలుసుకుని

శిక్షణలో భాగంగా ట్రైనీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారుల వారం రోజుల విలేజ్ విజిట్ కార్యక్రమం ముగిసింది. గ్రామీణ ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రధాన వృత్తులు, వ్యవసాయం, నీటి వసతి గురించి తెలుసుకున్నారు. 8లో▸



తల్లిదండ్రుల కల సాకారం చేయాలి

తల్లిదండ్రుల కలను సాకారం చేసేందుకు ప్రతీ విద్యార్థి శ్రమించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునే దిశగా అడుగులు వేయాని సీఎంవో ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ అన్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
34.2 / 18.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు భానుడి ప్రతాపం కొనసాగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది.

పన్ను లక్ష్యం చేరేనా..!

- మిగిలింది ఇరవై రోజులే..
- పంచాయతీల్లో రూ.1.41 కోట్ల బకాయిలు
- మున్సిపాలిటీల్లోనే అత్యధిక బాకీలు
- వసూళ్లకు అడ్డుపడుతున్న రాజకీయాలు

నిర్మల్: స్థానిక సంస్థల్లో ఈ ఏడాది పన్నుల వసూలుకు మరో 20 రోజులే గడువు ఉంది. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పన్నులు వందశాతం కట్టించాలని ప్రభుత్వం సీరియస్‌గా ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో జిల్లాలోనూ అధికారులు పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టారు. మున్సిపాలిటీలతో పోలిస్తే పంచాయతీల్లో పన్నుల వసూలు కొంత వేగంగానే సాగుతోంది. బల్దియాల్లో సిబ్బంది కొరతతో పాటు ఉన్నచోటా కొంత మందగమనంలోనే బకాయిల వసూళ్లు కొనసాగుతున్నాయి. పట్టణాల్లో ఈ పరిస్థితికి మొండి బకాయిలతోపాటు రాజకీయాలూ కారణమవుతున్నాయి. మనోడే సార్.. వదిలేయండి.. అంటూ లీడర్లు ఫోన్లు చేస్తుండటం అడ్డంకిగా మారుతోంది.

పన్నులు కడితేనే..

గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆయా స్థానిక సంస్థలు పన్నులు వసూలు చేస్తుంటాయి. ఇందులో ఇంటి ఏరియాను బట్టి ఆస్తి(ఇంటి)పన్ను వసూలు చేస్తారు. నీటి(నల్లాల)పన్ను, వెలుతురు(వీధిదీపాల) పన్ను, పారిశుధ్య పన్ను కలిపి ఇంటిపన్నులోనే తీసుకుంటారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు ఉంటే లైసెన్స్ ఫీజు రూపంలో కట్టించుకుంటారు. ఏటా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని ఆయా స్థానిక సంస్థలు ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. కట్టిన పన్నులే తిరిగి ఆయా సంస్థలకు నిధుల రూపంలో ప్రభుత్వం ఇస్తుంది.

సమీపిస్తున్న గడువు..

ప్రతీ ఆర్థిక సంవత్సరం చివరిలోనే పన్నులపై ఒత్తిడి పెరుగుతుంది. ఏడాదంతా పెద్దగా పట్టించుకోని అధికారులు గడువు సమీపిస్తున్న వేళ ఆగమేఘాల మీద వసూళ్లకు వెళ్తుంటారు. ఈసారి కూడా అదే సీన్ కనిపిస్తోంది. గ్రామాల్లో పెద్దగా ఇబ్బంది లేదు కానీ.. బల్దియాలకు వచ్చేసరికి మొండి బకాయిలు ఏళ్లుగా పేరుకుపోతున్నాయి. ఓవైపు ఆర్థిక లోటుతో ఇబ్బంది పడుతున్న సర్కారు ఈసారి ఎలాగైనా వందశాతం పన్నులను వసూలు చేయాలని చెబుతోంది. జిల్లాలోని పంచాయతీల్లో గడువులోపు పన్ను వసూలు లక్ష్యం పూర్తయ్యేలా ఉన్నా.. మూడు మున్సిపాలిటీల్లో మాత్రం వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. 60–70 శాతానికి మించి వసూలయ్యే అవకాశం కనిపించడం లేదు.

రాజకీయ ఒత్తిళ్లు..

'ఏం సార్.. మనోడికి టాక్స్ కట్టాలని బాగా టైట్ చేస్తున్నారట. జర వదిలేయండి. వాడు మనోడే. పైసలున్నప్పుడు కడతాడులే..' అంటూ ఇంటిపన్ను వసూలుకు కూడా నేతలు సిబ్బందికి, అధికారులకు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాకేంద్రంలో చాలామంది లీడర్లు, ప్రజాప్రతినిధులు పన్ను వసూళ్లల్లో కొర్రీలు పెడుతున్నారు. మనోళ్లే.. వదిలేయాలంటూ కౌన్సిలర్లే చెబుతుండటం గమనార్హం. ఇళ్లే కాదు.. నిత్యం ఎంతోకొంత సంపాదించుకునే దుకాణాల లైసెన్స్ ఫీజులనూ వసూలు చేయనివ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్తులకు అంతోఇంతో పన్నులు కడుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన టాక్సులు ఏళ్లకొద్దీ పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈనేపథ్యంలో పట్టణాల్లో మిగులు పన్నులు ఉంటున్నాయని, ప్రతీ ఏడాది 60–70శాతానికి మించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.



ఆస్తిపన్ను చెల్లిస్తున్న వృద్ధురాలు

పన్నుల వివరాలు...

పంచాయతీల్లో..	
మొత్తం	రూ.8,54,51,399
వసూలైనవి	రూ.7,13,23,808
మిగిలినవి	రూ.1,41,27,591
నిర్మల్ మున్సిపాలిటీ..	
మొత్తం	రూ.8.70 కోట్లు
వసూలైనవి	రూ.4.39 కోట్లు
పెండింగ్	రూ.5.30 కోట్లు
భైంసా మున్సిపాలిటీ..	
మొత్తం	రూ.6.07 కోట్లు
వసూలైనవి	రూ.1.27 కోట్లు
పెండింగ్	రూ.4.79 కోట్లు
ఖానాపూర్ మున్సిపాలిటీ..	
మొత్తం	రూ.53.42 లక్షలు
వసూలైనవి	రూ.39.36 లక్షలు
పెండింగ్	రూ.13.36 లక్షలు

వంద శాతం పన్ను వసూలు చేయాలి

లోకేశ్వరం: ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని డీపీవో శ్రీలత అన్నారు. మండలంలోని రాయపూర్‌కాండ్లీలోని శుక్రవారం రికార్డులు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేష్ షెడ్, హరిత హారం మొక్కలను పరిశీలించారు. ఈసందర్భంగా డీపీవో శ్రీలత మాట్లాడుతూ వేసవి సమీస్తున్నందున గ్రామాల్లో తాగు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఇంటింటికీ చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలని సూచించారు. ఇంటి పన్నులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను కాపాడాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో సల్మాన్ రాజ్, కార్యదర్శి నారాయణ్ ఉన్నారు.



పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

వందశాతం వసూలు చేస్తాం..

జిల్లాలోని గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేస్తాం. ఇప్పటికే 83 శాతానికిపైగా వసూలయ్యాయి. మిగిలిన లక్ష్యాన్ని ఈనెలాఖరులోపు పూర్తిచేసేస్తాం. ఇందుకు ఆయా గ్రామాల ప్రజలూ సహకరించాలని కోరుతున్నాం.

– శ్రీలత, డీపీవో

బీఆర్ఎస్ పాలనలోనే ఆలయాల అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రంలో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని న్యూ పోచంపాడు గ్రామంలో ఆయన రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, మరో రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. సీఎం కేసీఆర్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను సైతం అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. పూజారులకు గౌరవ వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ భూమేశ్, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు



మాట్లాడుతున్న పరిశీలకుడు చంద్రశేఖర్

ఖానాపూర్: మండలంలోని రాజుర, సత్తనపల్లి, మస్కాపూర్, సుర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ఎఫ్ఏ మార్కులు, ఎస్ఏ–1 మార్కులు, ప్రత్యేక తరగతుల నిర్వహణతోపాటు నూతన ప్రశ్నపత్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యూస్‌రీల్

న్యాక్ శిక్షణ కేంద్రం పరిశీలన



శిక్షణ బృందంతో అసిస్టెంట్ కమిషనర్ శ్రావణి

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామంలోని న్యాక్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం లేబర్ అసిస్టెంట్ కమిషనర్ శ్రావణి పరిశీలించారు. నిరుద్యోగ యువత శిక్షణ కేంద్రాల్లో చేరి ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్, మేస్త్రీ, పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కేంద్రాలను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు నైపుణ్యాన్ని వివరించారు. ఆమె వెంట న్యాక్ శిక్షకుడు రమేశ్ ఉన్నారు.

టీఎస్ ఆర్జేసీకి దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ రూరల్: పదో తరగతి చదివే విద్యార్థులు టీఎస్ ఆర్జేసీ సెట్– 2023కు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ నీరడి గంగాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. పరీక్ష మే 6న ఉంటుందని వెల్లడించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 040–24734899 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'అతిథి' పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమరావు తెలిపారు. ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత విషయంలో 55% తక్కువ కాకుండా(ఎస్సీ ఎస్టీలకు 50%) మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. బోధన అనుభవం ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తామన్నారు. అన్ని ధ్రువపత్రాలతో మార్చి 16వ తేదీ ఉదయం 11 గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

12న ఆత్మగౌరవ సదస్సు

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు కోసం ఈనెల 12న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముప్కం రామకృష్ణగౌడ్ కోరారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో మధ్యాహ్నం 1 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు బీజేపీ పదాధికారుల సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, ఇన్‌చార్జీల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు కొండాపూర్‌లోని ఉమామహేశ్వర బంకెట్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి గంగిడి మనోహర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా సహ ఇన్‌చార్జి మ్యాన మహేశ్ హాజరవుతారని వివరించారు. ఈ సమావేశానికి జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మోర్చాల ప్రధాన కార్యదర్శులు, మండలాల అధ్యక్షులు హాజరు కావాలని సూచించారు.

అర్హులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న సిద్ధార్థనాయక్

ఖానాపూర్: డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం అనర్హులతో జాబితా తయారు చేయించి అర్హులైన పేదలకు అన్యాయం చేయాలని చూస్తోందని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానావత్ సిద్ధార్థనాయక్ ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపికకు లక్కీడ్రా పద్ధతిలో పూర్తిగా అవకతవకలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. మొదటిసారి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు అసలైన పేదలకు అన్యాయం చేసేందుకే రెండోసారి దరఖాస్తులు స్వీకరించి కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. అన్యాయం జరిగిన పేదలకు న్యాయం జరిగే వరకు తమ సంఘం ఆధ్వర్యంలో అండగా ఉంటామని తెలిపారు. వెంటనే అనర్హులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎగుర్ల మహేశ్, కరిపె రాజశేఖర్, ఖదీర్, రమేశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

స్టైఫండ్ జాడేది?



లక్ష్మణచాంద కేజీబీవీ పాఠశాల భవనం

- విద్యార్థినులకు తప్పని ఎదురు చూపులు
- సొంత డబ్బులతోనే కాస్మొటిక్స్ కొనుగోలు

లక్ష్మణచాంద: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలికలకు కాస్మోటిక్ చార్జీలు అందడం లేదు. బాలికల ఆరోగ్యం కోసం కరోనా ముందు వరకు ప్రభుత్వం ఆరోగ్య కిట్‌లు అందించింది. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాల్లో చదువుతున్న బాలికలకు ఈ కిట్లు అందించారు. కరోనాతో రెండేళ్ల విద్యాసంస్థలు సక్రమంగా తెరుచుకోలేదు. దీంతో కిట్ల సరఫరాను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో పునఃప్రారంభమైనా కిట్‌లు సరఫరా చేయలేదు. ఈ క్రమంలో కిట్ల స్థానంలో నెలనెలా స్టైఫండ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విద్యార్థినులతో బ్యాంకు ఖాతాలు కూడా తీయించారు. అయితే విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చినా స్టైఫండ్ మాత్రం విద్యార్థినుల ఖాతాల్లో సమ చేయలేదు. దీంతో పేద విద్యార్థులు సొంత డబ్బులతోనే కాస్మోటిక్, శానిటరీ నాప్కిన్స్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది పేద విద్యార్థులకు భారంగా మారింది.

జిల్లా సమాచారం....

ఉన్నత పాఠశాలలు	164
కేజీబీవీలు	18
ఆదర్శ పాఠశాలలు	01
గురుకులాలు	01
మొత్తం విద్యార్థినులు	30 వేలు

నెలకు రూ.100 చొప్పున..

విద్యార్థినులకు అందించే ఆరోగ్య కిట్‌కు బదులుగా నెలవారీగా నగదు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఈమేరకు విద్యాసంవత్సరం ప్రారంభమైన మొదట్లో విద్యార్థినులతో బ్యాంకు ఖాతాలు తెరిపించారు విద్యాశాఖ అధికారులు నెలనెల విద్యార్థిని ఖాతాలో రూ.100 చొప్పున జమ చేయాలని ప్రభుత్వం నిర్వహించింది. నేరుగా విద్యార్థినుల ఖాతాలోనే నగదు జమవుతాయని అధికారులు తెలిపారు. కానీ విద్యాసంవత్సరం ముగింపు దశకు వచ్చినా నగదు మాత్రం ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. స్టైఫండ్ విడుదల చేస్తే విద్యార్థినులు వాటితో తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి బాలికలకు నెలనెలా స్టైఫండ్ అందించేలా చూడాలని కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



ఇంతకు ముందు పాఠశాలలో తమకు ఆరోగ్య కిట్ ఇచ్చేవారు. ఇప్పుడు దానికి బదులు డబ్బులు ఇస్తామని చెప్పారు. బ్యాంక్ అకౌంట్ వివరాలు కూడా తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు రాలేదు. దీంతో కాస్మోటిక్స్, శానిటరీ నాప్కిన్స్ కోసం ఇబ్బందిగా ఉంది.

– ప్రవీణ, విద్యార్థిని

వివరాలు అందించాం



ప్రభుత్వం విద్యార్థినుల బ్యాంకు ఖాతాలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగా విద్యార్థినుల ఖాతా వివరాలు తీసుకుని ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం నుంచి వివరాలు నిధులు రావాల్సి ఉంది.

– నవిత, ఎస్‌వో, లక్ష్మణచాంద

త్వరలో వచ్చే అవకాశం



ప్రభుత్వం సూచనల మేరకు అన్ని పాఠశాల్లో బాలికల వివరాలతోపాటు, బ్యాంక్ ఖాతాల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. ఫిబ్రవరిలోనే జమ అవుతాయని తెలిసింది. కానీ జమ కాలేదు. ఈనెలలో జమయ్యే అవకాశం ఉంది.

– శ్రీదేవి, సెక్టోరియల్ అధికారి

ముగిసిన ట్రెయినీ అధికారులు పర్యటన



అధికారులను సన్మానించిన సర్పంచ్, సిబ్బంది

లక్ష్మణచాంద/కడెం: ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధి కారుల విలేజ్ స్టడీ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ఈనెల 4న జిల్లాలోని లక్ష్మణచాంద, కడెం, ఖానా పూర్ మండలాలకు మూడు బృందాలుగా చేరుకున్నారు. లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లిలో ఐదురుగు అధికారులు వారంపాటు గడిపారు. ప్రతీరోజు గ్రామంలో పర్యటించారు. ఇందులో భాగంగా అనేక అంశాలు నేర్చుకున్నట్లు బృందం లీడర్ రాహుల్ సింగ్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం, వారి అలవాట్లు, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వారికి అందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల తీరు, పాఠశాల, వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె ప్రకృతి వనం సందర్శించామని చాలా సంతృప్తినిచ్చిందని తెలిపారు. తమకు ఆతిథ్యం ఇచ్చి తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్న సర్పంచ్ రాజేందర్‌కు, పంచాయతీ కార్యదర్శి సౌజన్యకు, సిబ్బంది శ్రావణ్, శివకృష్ణ, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సర్పంచ్ ట్రెయినీ అధికారులను సన్మానించారు. ఇందులో రాహుల్ సింగ్, షెఫాలీ, వీణాసింగ్, భావన జోషి, గోవర్ధన్ మీనన్ ఎంపీవో నసీరుద్దీన్, ఎఫ్ఏ అశోక్ పాల్గొన్నా రు. కడెం మండలం నచ్చన్ఎల్లాపూర్ గ్రామంలో పర్యటించిన సందీపన్ సర్కార్, బంటి కుమార్, ఆలీ షాఖానం, ప్రీతంసేన్, సౌమ్య బుదిరాజా పర్యటన ముగియడంతో శుక్రవారం జీపీ కార్యాల యం వద్ద సర్పంచ్ బొడ్డు గంగన్న అధికారులకు మహా నీయుల చిత్రపటాలను అందజేసి, వీడ్కోలు పలికారు. ఎంపీవో వెంకటేశ్, కార్యదర్శి మనోజ్ ఉన్నారు.

మీ ఆదరణ మర్చిపోం..



జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

ఖానాపూర్: తమ శిక్షణలో భాగంగా గ్రామంలో పర్యటించిన తమకు గ్రామస్తుల నుంచి లభించిన ఆదరణ ఎప్పటికీ మర్చిపోమని ట్రెయినీ అధికారులు ముస్కాన్ జైన్, చాయాసింగ్, శిఖా రాయ్, రూపాలి దశరథ్ కర్నే, అంజలి మోరియా, కీర్తి అన్నారు. మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలు అధికారులతో సెల్ఫీలు దిగారు. గ్రామానికి 50 మరుగుదొడ్ల మంజూరుకు డీఆర్డీవో హామీ ఇచ్చారని తెలిపారు. జాలర్లు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఎండు చేపలు, పచ్చి చేపలకు మార్కెట్ సౌకర్యం కావాల్సి ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నారని, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం సర్పంచ్ కొడారి గోపాల్ ఆధ్వర్యంలో అధికారులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?



కోతకు గురై ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డు ఎక్కడో మారుమూల గ్రామంలోనిది కాదు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేట్ – ఎల్లారెడ్డిపేట్ రోడ్డు. గత జూలైలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగడంతో రోడ్డు ఇలా కోతకుగురైంది. ఆరు నెలలైనా అధికారులు ఈరోడ్డుకు మరమ్మతు చేయడం లేదు. తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న రోడ్డు పరిస్థితే ఇలా ఉంటూ ఇక మారుమూల గ్రామాల రోడ్లు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అధికారులు పనితీరుకు ఈ రోడ్డు అద్దం పడుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

అమ్మవారిని దర్శించుకున్న సీఎంవో ఓఎస్డీ



పూజలు చేస్తున్న ఓఎస్డీ ప్రియాంకవర్గీస్

భైంసా: బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారిని తెలంగాణ ప్రభుత్వ సీఎంవో ఓఎస్డీ ప్రియాంకవర్గీస్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. వారి వెంట ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్, ఆర్డీవో రవికుమార్, తహసీల్దార్ ఉన్నారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి

- కొలతల్లో తేడాలు ఉంటే చర్యలు
- డీఆర్డీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: ఉపాధిహామీ పథకంలో నిబంధనల మేరకు పనులు చేపట్టాలని, కొలతల్లో తేడాలు ఉంటే ఉపేక్షించబోమని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. ఎంపీపీ కల్పన అధ్యక్షతన భైంసా ఎంపీడీవో కార్యాలయంలో 13వ బహిరంగ విచారణ శుక్రవారం నిర్వహించారు. మొదటిరోజు రెండు పంచాయతీలకు సంబంధించిన పనులు, రికార్డులు పరిశీలించారు. శనివారం సైతం ప్రజావేదిక కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మొదటి రోజు మాటేగాం, పేండ్‌పెల్లి పంచాయతీల్లో చేపట్టిన పనులను, రికార్డులను తనిఖీ చేశారు. 2019, జనవరి 1 నుంచి 2022, మార్చి 31 వరకు రూ.17,87,33,084 ఉపాధిహామీ పనులు నిర్వహించారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులు ఉపాధి కూలీలతో కలిసి సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి కూలీలను కలిసి వివరాలు సేకరించారు. గ్రామాల వారీగా సేకరించిన వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభ నిర్వహించి వివరాలు వెల్లడించారు. అనంతరం మండలంలో నిర్వహించిన ప్రజావేదికలో తమ దృష్టికి వచ్చిన విషయాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవో విధుల్లో నిర్లక్ష్యంతో రికార్డులను సరిగా నిర్వహించకపోవడం, ఫొటోలు నిర్వాహణ చేయకపోవడం వంటివి గుర్తించారు. మాటేగాంలో వాచ్‌అండ్‌వాడ్‌లో పనులు చేయకున్నా సర్పంచ్ కుమారుడు రూ.39,450 తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, హెచ్ఆర్ సుధాకర్, ఎస్ఆర్పీ రాఘువులు ఉన్నారు.

క్లుప్తంగా

శనగ కుప్ప దగ్ధం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో భగ్నూరే లక్ష్మణ్‌రావు అనే కౌలు రైతుకు చెందిన శనగ కుప్ప శుక్రవారం రాత్రి కాలిబుడిదైన సంఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం.. నాలుగు రోజుల కిందట పంట కోసి నూర్పిడి కోసం కుప్పగా పెట్టాడు. శుక్రవారం రాత్రి ఆకస్మాతుగా శనగ కుప్పకు నిప్పు అంటుకుని కాలిబూడిదైనట్లు తెలిపారు. దాదాపుగా రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. సంఘటనా స్థలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ వెళ్లి పంచనామా నిర్వహించారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


ప్రియాంక మృతదేహం

కుభీర్: కడుపు నొప్పి భరించలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నిగ్వా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్ వివరాల ప్రకారం... గాడేకర్ ప్రియాంక (22) నాలుగేళ్ల క్రితం విఠల్‌తో వివాహమైంది. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి తీవ్రం కావడంతో గురువారం రాత్రి 2గంటల ప్రాంతంలో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిరాణా ఏజెన్సీలో చోరీ


ఆధారాలు పరిశీలిస్తున్న క్లూస్ టీం

భైంసాటౌన్: పట్టణంలోని వినాయక్‌నగర్‌లోని జువెల్లరీ మార్కెట్ సమీపంలోని రవి కిరాణ ఏజెన్సీ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఉదయం కాంప్లెక్స్‌లోని ఇతర దుకాణదారులు షెట్టర్ పగులగొట్టి ఉండడం గమనించి దుకాణ యజమానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీను చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. నూనె డబ్బాలు, కంప్యూటర్ మానిటర్ చోరీకి గురైనట్లు బాధితుడు రవి తెలిపారు.

శ్రీనివాస్ ఆచూకీ లభ్యం

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన బొంతల శ్రీనివాస్ దుబాయ్‌లో కనబడకుండా పోయిన విషయం తెలిసిందే. అతడు దుబాయ్‌లోని భారత ఎంబసీలో సురక్షితంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. తమతో ఫోన్లో మాట్లాడినట్లు చెప్పారు. అయితే సదరు కంపెనీ వారు మార్చి 4వ తేదీ రాత్రి 2గంటలకు దుబాయ్ ఎయిర్‌పోర్టులో అతడిని కలుసుకోవాల్సి ఉండగా సదరు కంపెనీ వారు రిసీవ్ చేసుకోలేదు. దీంతో అతడు భారత ఎంబాసీని సంప్రదించాడు. ఆర్మూర్‌కు చెందిన ఏజెంట్ ద్వారా శ్రీనివాస్ వెళ్లాడని కుటుంబీకులు పేర్కొన్నారు. 5వ తేదీ ఆదివారం కావడంతో కంపెనీ ఏజెంటు శ్రీనివాస్‌ను రిసీవ్ చేసుకోలేదని ఆర్మూర్ ఏజెంట్ తెలిపాడని, కంపెనీతో మాట్లాడుతున్నామని ఏజెంటు పేర్కొన్నట్లు కుటుంబీలు తెలిపారు.

సందర్శించి.. తెలుసుకుని


పార్‌పెల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

గ్రౌండ్ రిపోర్ట్

- ముగిసిన ట్రైనీ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- వసతులపై ప్రత్యక్ష పరిశీలన
- 'సాక్షి'తో వారి మనోగతం..

లక్ష్మణచాంద: వారంతా ట్రైనీ అధికారులు.. వీరిలో ఒకరు ట్రైనీ ఐఈఎస్ కాగా, నలుగురు ట్రైనీ ఐఎస్ఎస్ ఆఫీసర్లు. ఈ నెల 4వ తేదీ నుంచి నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద, ఖానాపూర్, కడెం మండలాలను సందర్శించారు. ఇందులో ఐదుగురు లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి గ్రామానికి వచ్చారు. శిక్షణలో భాగంగా వీరు ఆరురోజులుగా గ్రామంలోనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, వాటి అమలు తీరు, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రధాన వృత్తులు, సాగు చేస్తున్న పంటలు, సాగునీటి వసతి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శుక్రవారం పర్యటన ముగించుకున్నారు. ఈ సందర్భంగా వారిని 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలు పంచుకున్నారు.

అవకాశం వస్తే తెలంగాణలో పని చేసేందుకు సిద్ధం



మాది ఉత్తరప్రదేశ్. తండ్రి సంత్‌కుమార్ సింగ్, తల్లి సావిత్రీదేవి. మాది మధ్యతరగతి కుటుంబం. తండ్రి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ నన్ను చదివించారు. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది. తండ్రి పడుతున్న కష్టం నేరుగా చూసి ఎలాగైనా మంచి ఉద్యోగం సాధించాలనే తపనతోనే ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. అదే పట్టుదలతో చదివి 2020లో ఐఎస్ఎస్ 15 ర్యాంక్‌తో సాధించాను. నేడు ఐఎస్ఎస్ ట్రైనింగ్ కోసం ఇక్కడకు వచ్చాను. ఇక్కడ పథకాలు, ప్రజల మంచి తనం చూసి ఆశ్చర్యానికి గురయ్యాను. నాకు తెలంగాణలో అవకాశం వస్తే తప్పకుడా పని చేస్తా.

– రాహుల్ సింగ్, ట్రైనీ ఐఎస్ఎస్ అధికారి

లక్ష్యం ముందే నిర్ణయించుకోవాలి



మాది ఢిల్లీ. తండ్రి రాజేంద్రకుమార్, తల్లి ఇంద్ర. తండ్రి చిన్న ప్రైవేట్ ఉద్యోగి, తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి ఇష్టంతో చదివేదాన్ని. పాఠశాల స్థాయి నుంచి పీజీ స్థాయి వరకూ మొత్తం ఫ్రీగానే చదివాను. ఎంఏ ఎకనామిక్స్ ఢిల్లీలో చేశాను. సరైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు. పీజీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు మొదటి సారి గ్రూపు పరీక్ష రాశాను కానీ రాలేదు. రెండో సారి పట్టుదలతో చదివి 2023 ఐఈఎస్‌లో 16వ ర్యాంక్ సాధించాను. – షెఫాలీ, ట్రైనీ అధికారి

అన్ని రంగాల్లో అభివృద్ధి



కడెం: శిక్షణలో భాగంగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ పర్యటించాం. ఈ గ్రామంలో పరిశుభ్రత, ఇంకుడుగుంతల నిర్మాణాలు, పాఠశాల, బ్యాంక్ సేవలందించేందుకు కస్టమర్ సర్వీస్ పాయింట్, చక్కని పరిపాలన అందించే పాలకవర్గం ఉంది. వ్యవసాయ ఆధారిత గ్రామంలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పిస్తే బాగుంటుంది.

– ఆలీషాఖానం, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్

పథకాల అమలు తీరు

ప్రజాసంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్తున్నాయా? లేదా? అనే అంశాల గురించి తెలుసుకునేందుకు నేరుగా ప్రజలతో మాట్లాడారు. పథకాల ఫలాలు అర్హులకు అందుతున్న తీరును ప్రజల ద్వారా తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు గల మౌలిక వసతులను ప్రత్యక్షంగా గమనించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామానికి గల రోడ్డు సౌకర్యం, గ్రామంలోని ఓపెన్ జిమ్, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, డంప్‌యార్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. అలాగే గ్రామంలో సాగు చేస్తున్న పంటల వివరాలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు.


పార్‌పెల్లిలో ట్రైనీ అధికారులు

పట్టుదలతో చదివి సాధించా



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. తండ్రి వాసుదేవ్ సింగ్, తల్లి నీలమ్ సింగ్. తండ్రి ఓ ప్రైవేట్ ఉద్యోగి. చిన్నతనం నుంచి విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చేశాను. పట్టుదలతో చదివి చివరకు 2022 లో ఐఎస్ఎస్‌లో నాలుగో ర్యాంక్ సాధించాను. ఇక్కడ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు సరైన లక్ష్యంతో ముందుకుసాగడం లేదు. పదో తరగతిలోనే లక్ష్యం నిర్ధారించుకునేలా కెరీర్ గైడెన్స్ ఏర్పాటు చేయాలి. – వీణాసింగ్, ట్రైనీ అధికారి

పల్లెవాతావరణం నచ్చింది



మాది ఉత్తరఖండ్ రాష్ట్రం. మా తండ్రి జీవన్ చంద్రజోషి, తల్లి లీలాజోషి. మా తండ్రి ప్రైవేట్ ఉద్యోగి. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. మాది మధ్య తరగతి కుటుంబం. కష్టాలు దాటుకుంటూ లక్ష్యం కోసం చదివి చివరకు 2020లో ఐఎస్ఎస్ ఐదో ర్యాంక్ సాధించాను. ఇక్కడి పల్లె వాతావరణం చాలా నచ్చింది. పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ విద్యతో పాటు, ఆంగ్లంపై పట్టు సాధించేలా చర్యలు చేపడితే ఉపయోగం.

– భావనాజోషి, ట్రైనీ అధికారి

కష్టాలను జయించి..



మాది ఢిల్లీ. మా తండ్రి బాబులాల్ మీన్, తల్లి రామ్‌పతి మీనస్. తండ్రి ప్రైవేట్ ఉద్యోగి కావడంతో తమ చదువుల కోసం అతడు అనేక కష్టాలు పడ్డారు. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పీజీ చేశాను. కష్టాలను అధిగమించి చదువులపై దృష్టి సారించి 2021లో 45వ ర్యాంక్ సాధించాను. సాధించాలనే తపన ఉంటే కష్టాలు అడ్డుకావు.

– గోవర్ధన్ మీనస్, ట్రైనీ అధికారి

నీటి విలువ గురించి తెలియజేశాం



కడెం: నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఆరురోజుల పాటు పర్యటించాం. గ్రామంలో అన్ని వసతులు బాగున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం నల్లా నీటిని అందించడం బాగుంది. కానీ.. చాలా వరకు ఇళ్లలో నల్లాలు బిగించనందున నీరు వృథాగా పోతోంది. గ్రామస్తులు నీటి వృథాను అరికట్టాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి

– సందీపన్ సర్కార్, ఇండియాన్ స్టాటిస్టికల్ సర్వీస్

గ్రామీణ జీవన విధానం బాగుంది



ఖానాపూర్: మండలంలోని మారుమూల గ్రామమైన ఎర్వచింతల్ ప్రజల జీవన విధానం బాగుంది. అత్యధిక మంది ఈ గ్రామంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు ఈ ప్రాంతం ఎగువభాగం కావడంతో బ్యాక్‌వాటర్‌లో ఎంతో మంది చేపలు పట్టి జీవనాన్ని సాగిస్తున్నారు. చేపలు విక్రయించేందుకు వీరికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తే వీరి జీవనం మరింత సాఫీగా ఉంటుంది.

– శిఖ, ట్రైనీ అధికారిణి

ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాం



ఖానాపూర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు ఆరురోజులపాటు శిక్షణ తీసుకున్నాం. ఇక్కడ స్థానిక అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సాదరంగా ఆహ్వానించి వసతి కల్పించారు. గ్రామంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. ఈ శిక్షణ నివేదికను కలెక్టర్‌తోపాటు శిక్షణ కేంద్రంలో అందజేస్తాం. గ్రామస్తుల ప్రేమ, ఆప్యాయతలు మరువలేనివి.

– ఛాయా, ట్రైనీ అధికారిణి

రేషన్‌కార్డుతో 'ఆయుష్మాన్ భారత్'

- ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా వైద్యం
- గ్రామాల్లో కొనసాగుతున్న ప్రక్రియ
- ఈ నెల 31 వరకు ఈ–కేవైసీకి అవకాశం

ఆదిలాబాద్ జిల్లాలో..	
రేషన్‌కార్డులు	: 1,91,902
ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు	: 66,302


ఆయుష్మాన్ కార్డును నమోదు చేస్తున్న సీఎస్సీ ఆపరేటర్

బోథ్: రాష్ట్రంలో ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ పథకం కింద రేషన్ కార్డు ఉన్నవారు ఉచితంగా వైద్యం చేయించుకునేవారు. రూ.2లక్షలలోపు వైద్యాన్ని అందించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణలో కూడా అమలు చేయడంతో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ రూ.5లక్షల వరకు దేశంలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ఆయుష్మాన్ భారత్–ఆరోగ్యశ్రీగా పిలుస్తున్నారు. ఈ కార్డు పొందాలంటే రేషన్‌కార్డు ఉన్న వారు ఈ–కేవైసీ చేయించుకోవాలి. గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కల్పించారు. సీఎస్సీ(కామన్ సర్వీస్ సెంటర్)లో కొత్త రేషన్ కార్డుకు ఆధార్ నంబరును అనుసంధానిస్తారు. ఏప్రిల్ నుంచి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తారు. జనవరి నుంచి ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియను సీఎస్సీ సెంటర్ల ఆపరేటర్లు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లోకి వెళ్లి ఈ–కేవైసీ చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా కేవైసీకి అవకాశం ఉంది.

దేశవ్యాప్తంగా ఎక్కడైనా వైద్య సేవలు..

ఆరోగ్యశ్రీ కార్డుతో కేవలం రాష్ట్రంలోనే వైద్య సేవలు చేయించుకునే అవకాశం ఉండేది. అది కూడా రూ.2లక్షలలోపు వైద్యానికే సరిపోతుంది. ఆయుష్మాన్ భారత్ కార్డుతో దేశవ్యాప్తంగా ఎక్కడైనా రూ.5లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశం ఏర్పడింది. ఈ కార్డుతో 1886 రకాల వ్యాధులకు చికిత్స చేయించుకోవచ్చు. ముఖ్యంగా కిడ్నీ, గుండె మార్పిడి, కాలేయ వ్యాధులు, మోకాలి చిప్ప మార్పిడితో పాటు అనేక రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,91,902 రేషన్ కార్డులు ఉన్నాయి. కాగా ఇప్పటివరకు 66 వేలు ఈ–కేవైసీ ద్వారా ఆయుష్మాన్ కార్డులను నమోదు చేసుకున్నారు. కాగా ఈ నెల 31వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది.

ఈ కేంద్రాల్లో నమోదుకు అవకాశం...

ఆయుష్మాన్ భారత్ కార్డులు నమోదు చేసుకోవడానికి రాష్ట్రంలో ఎక్కడినుండైనా చేసుకోవచ్చు. సీఎస్సీ కేంద్రాలు(కామన్ సర్వీస్ సెంటర్లు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య మిత్ర లేదా ఏఎన్ఎంలు నమోదు చేస్తారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలను వారికి చెబితే ఆయుష్మాన్ భారత్‌ను నమోదు చేస్తారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కోసం నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

31లోగా నమోదు చేసుకోవాలి



ప్రభుత్వం నుంచి వచ్చిన అర్హుల జాబితా ఆధారంగా సీఎస్సీ ఆపరేటర్లు గ్రామాల్లోకి వెళ్లి ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ పథకంలో తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే. ఈ నెల 31వ తేదీలోగా ఆయా గ్రామాల్లోని సీఎస్సీ సెంటర్ల వద్ద నమోదు చేసుకోవాలి. ఇందుకు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఫోన్ నంబరు వివరాలు ఇవ్వాలి. కేంద్రాల నిర్వాహకులు ఈ–కేవైసీ చేస్తారు. ఏప్రిల్ నుంచి కార్డులను అందజేస్తాం.

– రాహుల్, సీఎస్సీ జిల్లా మేనేజర్, ఆదిలాబాద్

దృష్టి మరల్చడానికే కొత్త నాటకం

- జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి


మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: ఈడీ కేసు నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ఎమ్మెల్సీ కవిత మహిళా రిజర్వేషన్ బిల్లుపై దేశ రాజధానిలో దీక్ష పేరిట కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ స్కాం విషయంలో ఈడీ నోటీసులు ఇవ్వగానే ఎమ్మెల్సీ కవితకు మహిళా రిజర్వేషన్ బిల్లు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు సరైన సముచిత స్థానం సైతం ఇవ్వడం లేదని మండిపడ్డారు. క్యాబినెట్ సమావేశంలో మంత్రులు రిజర్వేషన్ బిల్లు దీక్షలో కూర్చోవాలని ఆదేశాలు ఇవ్వడం దేనికి సంకేతం అన్నారు. సమావేశంలో నాయకులు విజయ్ గందేవార్, కాంత, రాము, ముఖీమ్, అనూప్, రవి ఉన్నారు.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో ఫారెస్టు అధికారులు

బోథ్: మండలంలోని నాగాపూర్ గ్రామంలో రూ. 27,666 విలువ గల కలపను పట్టుకున్నట్లు బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్ తెలిపారు. శుక్రవారం తమకున్న సమాచారం మేరకు నేరడిగొండ రేంజ్ అధికారి గణేష్‌తో సంయుక్తంగా ఆపరేషన్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కలపను బోథ్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఓలు సుందర్, ధన్‌సింగ్,ఎఫ్‌బిఓ రాకేష్, విశ్వజిత్, రాజేందర్, గంగమల్లులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో సామూహిక వివాహాలు


వధూవరులతో బలిరాం జాదవ్

ఇచ్చోడ: ఒకే వేదికపై సామూహికంగా వివాహాలు జరిపించే సంప్రదాయం గొప్పదని తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలిరాం జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్‌లో నాలుగు జంటలకు సామూహిక వివాహాలు చేశారు. ఈ సందర్భంగా బలిరాం జాదవ్ నూతన వధూవరులను ఆశీర్వదించి మాట్లాడారు. 30ఏళ్లుగా ఈ సామూహిక వివాహాలు చేస్తూ గ్రామస్తులు జిల్లా ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

కిడ్నాప్ కేసులో ఆరుగురు యువకుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని వర్ధా జిల్లా సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు ఇటీవల కిడ్నాప్ చేసినట్లు సమాచారం. ఆ యువకుడి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా డబ్బులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన ఆరుగురు యువకులు మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ఓ యువకుడిని సినీ ఫక్కీలో కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత ఆ యువకుడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చేసి రూ.2లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. దీంతో సదరు యువకుడి తల్లిదండ్రులు వీరిలో ఒకరి బ్యాంక్ ఖాతాలో రూ.20వేలు జమ చేశారు. ఈ విషయమై మహారాష్ట్రలోని వర్ధా జిల్లా అల్లిపూర్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ ఖాతా ఆధారంగా మహారాష్ట్ర పోలీసులు నిందితుల వివరాలను కనుగొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చేరుకొని కిడ్నాపర్ల వివరాలను సేకరించారు. శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఆరుగురు యువకులను అరెస్టు చేసి మహారాష్ట్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు వీరిని ఆదిలాబాద్‌రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్సైకు సమాచారం అందించారు. అనంతరం మహారాష్ట్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా స్థానిక యువకులు ఎవరిని కిడ్నాప్ చేశారు.. ఎందుకు కిడ్నాప్ చేశారనే వివరాలను రూరల్ పోలీసులను అడగగా తమకు సమాచారం తెలియదని, వారిని అరెస్టు చేసి తీసుకెళ్లే ముందు పోలీసుస్టేషన్‌కు వచ్చి సమాచారం అందించారని వివరించారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య


పరశురాం మృతదేహం

సారంగపూర్: మద్యం మత్తులో పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఆదివాసీగూడలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... దేశ్ముడే పరశురాం(30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే సమయంలో తన ఇంటికి మద్యం సేవించి వచ్చిన పరశురాంను భార్య విమల మందలించింది. ఈ క్రమంలో ఇంటినుంచి బయటకు వెళ్లి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. తిరిగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా మృతిచెందాడు. పరశురాంకు భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

సజీవ దహనం కేసులో బెయిల్ పిటిషన్ కొట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి గుడిపెల్లిలో గత డిసెంబర్ 16న జరిగిన సజీవదహనం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌ను ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ ఘటనలో మేడి లక్ష్మణ్, శనిగారపు సృజన, శ్రీరాముల రమేష్, వేల్పుల సమ్మయ్య, అర్నకొండ అంజయ్యలపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంచిర్యాల కోర్టులో హాజరుపర్చడం, రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. వీరిలో ఏ–1 లక్ష్మణ్, ఏ–3 శ్రీరాముల రమేష్, ఏ–4 వేల్పుల సమ్మయ్యలను డిసెంబర్ 23న పోలీసులు వారం రోజుల పోలీసు కస్టడీకి కోరగా ఆరు రోజులు 25నుంచి 30వరకు అనుమతి ఇచ్చారు. కాగా, శుక్రవారం నిందితుల తరఫున న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.